సాక్షి
వైఎస్‌ఆర్ జిల్లా

బుధవారం । 19 । ఏప్రిల్ । 2023



మది నిండా భక్తిభావం

జిల్లా అంతటా పండుగకు ముందే రంజాన్ కళ కనిపిస్తోంది. మంగళవారం షబ్బే ఖద్ర్ పర్వదినం కావడంతో మసీదులన్నీ భక్తులతో కళకళలాడాయి. - 8లో



పుష్పగిరి బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ

పుష్పగిరిలో కామాక్షీ వైద్యనాథేశ్వర స్వామి, శ్రీ లక్ష్మీ చెన్నకేశవ స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ చేశారు. - 8లో



21 నుంచి కడప గడపలో టీ-20 మ్యాచ్‌లు

కడపలో ఈనెల 21 నుంచి అంతర్ జిల్లాల క్రికెట్ మ్యాచ్‌లు నిర్వహిస్తున్నట్లు జిల్లా క్రికెట్ సంఘం కార్యదర్శి రెడ్డిప్రసాద్ తెలిపారు. - 8లో

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ బుధ (సా॥)	సహర్ గురు (ఉ॥)
కడప	6.32	4.43
ప్రొద్దుటూరు	6.31	4.46
పులివెందుల	6.34	4.48

టీడీపీలో ఆధిపత్య పోరు.!

- మొన్న లింగారెడ్డిపై పుత్తా నోటిదురుసు
- నేడు వరదపై లింగారెడ్డి మండిపాటు
- ఆహ్వానం లేకపోయినా ఎందుకొచ్చావ్ అంటూ తీవ్రస్వరం
- స్టేజీపై నుంచి దింపాలంటూ హుకుం
- ప్రాంతీయ సదస్సు సాక్షిగా విభేదాలు బట్టబయలు



మాజీ ఎమ్మెల్యే వరదపై మండిపడుతున్న మల్లెల లింగారెడ్డి

సాక్షి ప్రతినిధి, కడప: 'ఆలు లేదు, చూలు లేదు, కొడుకు పేరు సోమలింగం' అన్న సామెత చందంగా తయారైంది జిల్లాలో తెలుగుదేశం పార్టీ పరిస్థితి. ఎన్నికలు రానేలేదు, అప్పుడే అధికారంలోకి వచ్చినట్లుగా తెలుగు తమ్ముళ్లు భ్రమిస్తున్నారు. ఒకరిపై మరొకరు ఆధిపత్యం ప్రదర్శిస్తున్నారు. తెలుగుదేశం పార్టీలో పైచేయి మాదంటే మాదే అనిపించుకునే చర్యలకు తెగబడ్డారు. మంగళవారం కడపలో జరిగిన జోన్-5 ప్రాంతీయ సదస్సు అందుకు వేదికగా నిలిచింది. ప్రజానీకం విస్తుపోయేలా గండికోట ప్రాజెక్టు తానే కట్టానని అధినేత చంద్రబాబు అబద్ధాలు వల్లిస్తే, మరోవైపు ఆధిపత్యం కోసం తెలుగు తమ్ముళ్లు తగవులాడుకోవడం గమనార్హం. జోన్-5 ప్రాంతీయ సదస్సు నిర్వహణ ఏర్పాట్లు, పార్టీ వ్యవహారాల్లో పైచేయి సాధించాలనే ఆతృత జిల్లా నేతల్లో ఉండింది. అందుకు అనుగుణంగా తొలుత సమావేశాన్ని ఎయిర్‌పోర్టు సమీపంలో నిర్వహించాలని భావించారు. అయితే అక్కడొద్దు మాస్థలంలోనే ఏర్పాటు చేయాలని కమలాపురం ఇన్‌చార్జి పుత్తా నరసింహారెడ్డి పట్టుబట్టారు. ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా వేదికను ఎంపిక చేయాలనే ఉద్దేశంతో ఆ పార్టీ కడప పార్లమెంటరీ జిల్లా అధ్యక్షుడు మల్లెల లింగారెడ్డి రెండు ప్రాంతాలను అధికారులతో కలిసి పరిశీలించేందుకు సిద్ధమయ్యారు. ఈ క్రమంలో లింగారెడ్డిపై పుత్తా నరసింహారెడ్డి నోరు పారేసుకున్నట్లు పరిశీలకులు వెల్లడిస్తున్నారు. ఓవైపు అధికారులు, మరోవైపు జిల్లా అధ్యక్షుడి సూచనలను పట్టించుకోకుండా తాను చెప్పిందే జరగాలనే దిశగా పట్టుబట్టి పుత్తా పైచేయి సాధించారు. మంగళవారం జరిగిన ప్రాంతీయ సదస్సు సందర్భంగా లింగారెడ్డి ప్రవర్తించిన తీరు సైతం ఆ పార్టీ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

మాజీ ఎమ్మెల్యే వరదపై మండిపాటు...

జోన్-5 ప్రాంతీయ సదస్సుకు మాజీ ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ బచ్చల పుల్లయ్య ఇరువురు చేరుకున్నారు. స్టేజీ మీదున్న ఆ ఇరువురి చెంతకు జిల్లా అధ్యక్షుడు లింగారెడ్డి వెళ్లారు. ఎన్నికల్లో పార్టీ లేదు, బొ...లేదన్నావు. పిలుపు లేకపోయినా సి..శ...లేకుండా ఎలా వచ్చావంటూ నిలదీశారు. మరింత పరుష పదజాలం ప్రయోగించి, అసలు స్టేజీ మీదకు రానిచ్చినవారెవ్వరంటూ నానా హంగామా చేశారని పరిశీలకులు పేర్కొంటున్నారు. భవిష్యత్తులో ప్రొద్దుటూరు నియోజకవర్గంలో వరదరాజులరెడ్డి పార్టీ టికెట్ పోటీదారుడు అవుతారనే భయంతోనే ఆ స్థాయిలో మండిపడినట్లు తెలుగు తమ్ముళ్లు గుసగుసలాడుతున్నారు.

హవ్వా.. నవ్విపోదురుగాక..

'నావల్లే రాయలసీమకు నీరు వస్తోంది. గండికోట ప్రాజెక్టు నేనే కట్టాను. నా హయాంలోనే హంద్రీ-నీవా, గాలేరు-నగరి ప్రాజెక్టులకు అధిక నిధులు వెచ్చించాను.' ఈ మాటలన్నది ఎవ్వరో కాదు, టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు. పచ్చి అబద్ధాన్ని సైతం నిజమని నమ్మించడంలో చంద్రబాబు దిట్ట అనే విషయాన్ని మరోసారి ఆయన నిరూపించుకున్నారు. వాస్తవాలను పరిశీలిస్తే గండికోట ప్రాజెక్టును 1999-2004లో చంద్రబాబు హయాంలో అప్రాధాన్య ప్రాజెక్టుల జాబితాలోకి చేర్చారు. రాష్ట్ర బడ్జెట్‌లో అతి స్వల్ప నిధులు కేటాయించారు. అలాంటి పరిస్థితిలో చంద్రబాబు హయాంలో గండికోట ప్రాజెక్టు మరుగున పడింది. 2004లో డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత గాలేరు-నగరి సుజల స్రవంతి, హంద్రీ-నీవా సుజల స్రవంతి పథకాలను పరుగులెత్తించారు. అందులో భాగంగా గండికోట ప్రాజెక్టును డాక్టర్ వైఎస్ఆర్ పూర్తి చేశారు. ఇది జగమెరిగిన సత్యం. కాగా తానే గండికోట ప్రాజెక్టును పూర్తి చేశానని చంద్రబాబు చెప్పుకోవడం విడ్డూరంగా ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు. అధికారంలో ఉన్నన్నాళ్లు కడప స్టీల్ ప్లాంట్ గురించి చంద్రబాబు పట్టించుకున్న పాపాన పోలేదు. ఎన్నికల సమయంలో హడావుడిగా మైలవరం సమీపంలో స్టీల్ ప్లాంట్‌కు పునాది వేశారు. వాస్తవాలు ఇలా ఉంటే తాను మాత్రమే, తాను కొనసాగి ఉంటే అన్న మాటలు బాబు మినహా మరెవ్వరూ చెప్పుకోలేరని పలువురు పెదవి విరుస్తున్నారు.

చంద్రబాబు గోబ్యాక్

- కడపలో టీడీపీ అధినేత చంద్రబాబు పర్యటన పట్ల నిరసన
- లోకేష్‌తో క్షమాపణ చెప్పించాకే జిల్లాలో అడుగుపెట్టాలని డిమాండ్

కడప కార్పొరేషన్: విదేశీ విద్య వల్ల దళితులు పీకిందేమీ లేదని వ్యాఖ్యానించిన లోకేష్‌తో క్షమాపణ చెప్పించాకే చంద్రబాబు జిల్లాలో అడుగు పెట్టాలని ఏపీ సోషల్ వెల్ఫేర్ బోర్డు చైర్మన్ పులి సునీల్ కుమార్ డిమాండ్ చేశారు. మంగళవారం వైఎస్సార్ జిల్లా కడపలో చంద్రబాబు పర్యటనను నిరసిస్తూ వైఎస్సార్‌సీపీ ఎస్సీ విభాగం జిల్లా అధ్యక్షుడు సీహెచ్ వినోద్ కుమార్ ఆధ్వర్యంలో స్థానిక వినాయక నగర్ సర్కిల్ సమీపంలో నల్ల రిబ్బన్లు, నల్ల జెండాలు, నల్ల బెలూన్లతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దళితులను కించపరిచేలా మాట్లాడిన లోకేష్ బహిరంగ క్షమాపణ చెప్పాలన్నారు. గతంలో చంద్రబాబు కూడా దళితులుగా పుట్టాలని ఎవరైనా కోరుకుంటారా అని తమను అవమానించేలా మాట్లాడారని గుర్తు చేశారు. ఇప్పుడు ఆయన తనయుడు కూడా అలాంటి వ్యాఖ్యలే చేయడం దారుణమన్నారు. దళితులకు క్షమాపణ చెప్పిన తర్వాతే జిల్లాలో అడుగు పెట్టాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా అక్కడి నుంచి వెళ్లిపోవాలని పోలీసులు సూచించగా వారు అంగీకరించలేదు. బలవంతంగా తరలించేందుకు ప్రయత్నించగా పోలీసులు, నిరసనకారుల మధ్య వాగ్వాదం, తోపులాట జరిగింది. ఎట్టకేలకు పోలీసులు వారిని బలవంతంగా అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ ఎస్సీసెల్ మాజీ అధ్యక్షుడు జి. గరుడాద్రి, త్యాగరాజు, నగర అధ్యక్షుడు చైతన్య, కార్పొరేటర్లు ఆర్. చెన్నయ్య, కె బాబు, కో ఆప్షన్ సభ్యురాలు బండి మరియలు, పార్టీ నాయకులు ఎస్. సుబ్బారెడ్డి, పి. సంపత్ కుమార్, బండి బాబు, చైతల్య, దత్తసాయి, లక్ష్మీనారాయణ, సీహెచ్ సునీల్, సుశీలమ్మ, జ్యోతి, తులశమ్మ తదితరులు పాల్గొన్నారు.



నల్లజెండాలు, నల్ల బెలూన్లతో నిరసన వ్యక్తం చేస్తున్న వైఎస్సార్‌సీపీ దళిత నాయకులు

గడువులోపు గృహ నిర్మాణాల పూర్తి



మాట్లాడుతున్న కలెక్టర్ విజయరామరాజు

కలెక్టర్ విజయరామరాజు

కడప సెవెన్‌రోడ్స్ : జగనన్న కాలనీల్లో గృహ నిర్మాణాలకు ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందని, నిర్దేశిత గడువులోపు వాటిని పూర్తి చేసేందుకు అధికారులు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ విజయరామరాజు ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ సభా భవనంలో వివిధ శాఖల అధికారులతో నిర్వహించిన సమావేశంలో గృహ నిర్మాణ అంశంపై ఆయన సమీక్షించారు. అర్హతగల ప్రతి పేదవాడికి ఇంటి స్థలం, సొంత ఇల్లు ఇవ్వాలన్నది ప్రభుత్వ లక్ష్యమన్నారు. ప్రతి వారం గృహ నిర్మాణ పనుల పురోగతిపై నివేదికలు పంపాలని చెప్పారు. గృహ నిర్మాణాల్లో వెనుకబడితే శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇంకా ప్రారంభంకాని ఇళ్లను వెంటనే ప్రారంభించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జేసీ గణేష్‌కుమార్, మున్సిపల్ కమిషనర్ సూర్యసాయి ప్రవీణ్‌చంద్, అసిస్టెంట్ కలెక్టర్ రాహుల్ మీనా, డీఆర్వో గంగాధర్‌గౌడ్, హౌసింగ్ పీడీ కృష్ణయ్యలతోపాటు ఆర్డీఓలు, నియోజకవర్గ, మండల ప్రత్యేక అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, తహసీల్దార్లు, ఎంపీడీఓలు పాల్గొన్నారు.

సచివాలయ ఉద్యోగులకు తీపి కబురు

- ప్రొబెషన్ డిక్లేర్ చేసిన ముఖ్యమంత్రి
- జిల్లాలో రెండవ విడతలో 387 మందికి అర్హత
- మే నెల నుంచి పే స్కేల్ వర్తింపు
- మాట నిలబెట్టుకున్న సీఎం వైఎస్ జగన్
- ఉద్యోగుల్లో హర్షం



కడప సెవెన్‌రోడ్స్: రాష్ట్ర ప్రభుత్వం 2020లో విడుదల చేసిన రెండవ విడత నోటిఫికేషన్ ద్వారా జిల్లాలోని గ్రామ, వార్డు సచివాలయాల్లో ఉద్యోగాలు పొందిన వారికి నిర్ణీత గడువులోపే ప్రొబెషన్ డిక్లరేషన్‌ను చేసి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాట నిలుపుకున్నారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులు జిల్లా కేంద్రానికి వచ్చాయి. నిబంధనల మేరకు రెండేళ్ల సర్వీసు పూర్తి చేసి, డిపార్టుమెంటు పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించి, ఎలాంటి నేర చరిత్ర లేదని పోలీసు నివేదికల ద్వారా తేలిన 387 మందిని జిల్లాలో ప్రొబెషన్‌కు అర్హులుగా నిర్ణయించారు. వీరందరికీ మే నెల నుంచి పే స్కేల్ వర్తిస్తుంది. అంటే జూన్‌లో వీరు పెరిగిన కొత్త వేతనం తీసుకోబోతున్నారు. ఇంకా 320 మందికి ప్రొబెషన్ డిక్లేర్ కావాల్సి ఉంది. సచివాలయ ఉద్యోగులకు ప్రొబెషన్ డిక్లేర్ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వుల పట్ల ఆ శాఖలో పనిచేస్తున్న ఉద్యోగుల్లో హర్షం వ్యక్తమవుతోంది. ప్రొబెషన్ పొందిన ఉద్యోగులు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి ధన్యవాదాలు తెలియజేస్తున్నారు.

సకాలంలో ప్రొబెషన్ ఇవ్వడం సంతోషదాయకం



మాది కమలాపురం మండలం లేటపల్లె గ్రామం. రెండవ నోటిఫికేషన్‌లో ఉద్యోగం సాధించాను. రెండు సంవత్సరాల్లో ప్రొబెషన్ డిక్లేర్ చేస్తామని రాష్ట్ర ప్రభుత్వం చెప్పింది. ఇప్పుడు చెప్పిన మాట ప్రకారం ప్రొబెషన్ ఇవ్వడం చాలా సంతోషంగా ఉంది. – చల్లా శివమహేశ్‌రెడ్డి, వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్, శివాలపల్లె, చెన్నూరు మండలం

సీఎంకు కృతజ్ఞతలు



మాది వీఎన్ పల్లె మండలం యు.రాజుపాలెం గ్రామం. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సచివాలయ వ్యవస్థ తీసుకు రావడంతో ఉద్యోగం పొందాను. ఇప్పుడు ప్రొబెషన్ డిక్లేర్ చేయడం సంతోషకరం. ఇందుకు సీఎంకు కృతజ్ఞతలు. – కె.శ్రీనాథ్‌రెడ్డి, వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్, బయపల్లె, చెన్నూరు మండలం

పది మూల్యాంకనానికి సర్వం సిద్ధం

- నేటి నుంచి ప్రారంభం
- ఈ నెల 26 వరకు క్యాంపు నిర్వహణ
- ఏర్పాట్లు సిద్ధం చేసిన విద్యాశాఖ అధికారులు
- 1045 మంది సిబ్బందితో మూల్యాంకనం



మూల్యాంకనం నిర్వహించనున్న మున్సిపల్ హైస్కూల్ మెయిన్ పాఠశాల

పేపర్‌కోడ్	సీఈ	ఏఈ	స్పెషల్ అసిస్టెంట్	మొత్తం
తెలుగు	24	71	24	119
హిందీ	28	84	28	140
ఇంగ్లిష్	30	90	30	150
మ్యాథ్స్	26	78	26	130
పి.సైన్సు	30	90	30	150
బి.సైన్సు	30	90	30	150
సోషియల్	29	87	29	145
ఉర్దూ	07	22	07	36
హిందీ	02	07	02	11
తెలుగు ఉర్దూమీడియం)	02	05	02	09
సంస్కృతం	01	03	01	05
మొత్తం	209	627	209	1045

కడప ఎడ్యుకేషన్: పదో తరగతి పబ్లిక్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించిన ప్రభుత్వం మరో ఘట్టంలోకి అడుగుపెడుతోంది. జిల్లా వ్యాప్తంగా పది విద్యార్థులు రాసిన సమాధాన పత్రాల మూల్యాంకనాన్ని బుధవారం నుంచి ప్రారంభించనున్నారు. కడప మున్సిపల్ హైస్కూల్ మెయిన్‌లో ప్రభుత్వ పరీక్షల విభాగం ఆధ్వర్యంలో మూల్యాంకనాన్ని పక్కాగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లను సిద్ధం చేశారు. ఈ మూల్యాంకన కార్యక్రమం ఈనెల 19 నుంచి 26వ తేదీ వరకు నిర్వహించనున్నారు. జిల్లా విద్యాశాఖ అధికారి ఎద్దుల రాఘవరెడ్డి క్యాంపు ఆఫీసర్‌గా వ్యవహరించనున్నారు.

ముగ్గురు ఏఈలకు ఒక సీఈ, స్పెషల్ అసిస్టెంట్

విద్యార్థుల సమాధాన పత్రాలను మూల్యాంకనం చేసేందుకు ముగ్గురు చొప్పున అసిస్టెంట్ ఎగ్జామినర్లు(ఏఈ)ను ఒక బృందంగా ఏర్పాటు చేస్తున్నారు. ముగ్గురు ఏఈలకు ఒక చీఫ్ ఎగ్జామినర్ (సీఈ)తో పాటు ఒక స్పెషల్ అసిస్టెంట్ ఉంటారు. ఒక్కో ఏఈ రోజుకు 40 సమాధాన పత్రాలను మూల్యాంకనం చేయాల్సి ఉండగా ఏఈలు మూల్యాంకనం చేసిన పత్రాలను సీఈలు క్షుణ్ణంగా పరిశీలిస్తారు. విద్యార్థులు రాసిన సమాధానాలు సరైనవి, కానివి పరిశీలించి వేసిన మార్కులను నిశిత పరిశీలన చేస్తారు. అదే విధంగా జవాబు పత్రాల్లో ఏఈలు వేసిన మార్కులను కూడి మొత్తం మార్కులను వేసే విధులను స్పెషల్ అసిస్టెంట్లు నిర్వహిస్తారు. ఈ విధంగా ఒక బృందం రోజుకు 120 సమాధాన పత్రాలను మూల్యాంకనం చేసి మార్కులు వేయడంతోపాటు వేసిన మార్కులు సరిగా ఉన్నవి, లేనివి క్షుణ్ణంగా తనిఖీ చేస్తారు. క్యాంపు అధికారికి సహాయకులుగా సహాయ క్యాంపు అధికారులను నియమిస్తారు. సీనియర్ హెచ్‌ఎంలు, స్కూల్ అసిస్టెంట్లు, ఎస్జీటీలు మూల్యాంకన విధుల్లో సీఈ, ఏఈ, స్పెషల్ అసిస్టెంట్లుగా వ్యవహరించనున్నారు.

1045 మంది సిబ్బంది ఏర్పాటు

రాష్ట్ర వ్యాప్తంగా మూల్యాంకనానికి రానున్న 1,80,000 పేపర్లను మూల్యాంకనం చేసేందుకు జిల్లా వ్యాప్తంగా 1045 మంది సిబ్బందిని విధులకు ఏర్పాటు చేశారు. ఇందులో చీఫ్ ఎగ్జామినర్లుగా 209 మందిని, అసిస్టెంట్ ఎగ్జామినర్లుగా 627 మందిని, స్పెషల్ అసిస్టెంట్లుగా 209 మందిని ఇలా మొత్తంగా మూల్యాంకన విధులకు 1045 మందిని నియమించారు.

పక్కాగా నిబంధనలు అమలు

పదో తరగతి మూల్యాంకనంలో పాల్గొనే సిబ్బందికి ప్రత్యేక గుర్తింపు కార్డులు జారీ చేయనున్నారు. గుర్తింపు కార్డు ఉన్న వారినే ఆ ప్రాంతంలోకి అనుమతించనున్నారు. మూల్యాంకనం జరుగుతున్న అన్ని రోజులు అటువైపు ఇతరులు రాకుండా ఆంక్షలు విధిస్తున్నారు. విధుల్లో పాల్గొనే సిబ్బంది సెల్‌ఫోన్, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలను వెంట తీసుకెళ్లడానికి లేదు. విధులకు కేటాయించిన సిబ్బంది ప్రతి రోజు ఉదయం 9.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు మూల్యాంకన కేంద్రంలో ఉండాల్సి ఉంది. సిబ్బందికి అవసరమైన అన్ని రకాల మౌలిక వసతులు కల్పించారు.


పక్కాగా ఏర్పాట్లు



నేటి నుంచి నిర్వహించనున్న పది సమాధాన పత్రాల మూల్యాంకనానికి అన్ని ఏర్పాట్లను పక్కాగా చేశాము. మూల్యాంకన విధులకు హాజరయ్యే సిబ్బందికి అవసరమైన తాగునీరు, గదుల్లో లైటింగ్‌తోపాటు ఫ్యాన్లు, టాయిలెట్లను ఏర్పాటు చేశాం. మూల్యాంకనంలో విధులు నిర్వహించే సిబ్బందికి అన్ని రకాల సూచనలు, సలహాలు ఇచ్చాము. మార్కులు వేసే విషయంలో అన్ని జాగ్రత్తలు పాటించాలి. వేసిన మార్కులను మొత్తం చేసేటప్పుడు ఒకటికి రెండు సార్లు సరి చూసుకోవాలి. – ఎద్దుల రాఘవరెడ్డి, డీఈఓ, క్యాంపు ఆఫీసర్, కడప.

విద్యార్థులు 'జగనన్న వసతి దీవెన' పొందాలి

సాంకేతిక సమస్యలు పరిష్కరించాలని సోషల్ వెల్ఫేర్ జేడీ జయప్రకాశ్ సూచన



జగనన్న విద్యా దీవెనపై జూమ్ కాన్ఫరెన్స్‌లో సూచనలిస్తున్న సోషల్ వెల్ఫేర్ జేడీ జయప్రకాశ్

కడప రూరల్: జిల్లా వ్యాప్తంగా ఉన్న అర్హులైన విద్యార్థులు జగనన్న వసతి దీవెన కింద లబ్ధి పొందేలా క్షేత్ర స్థాయిలో ఉన్న సాంకేతిక సమస్యలను పరిష్కరించాలని జిల్లా సాంఘిక సంక్షేమశాఖ జాయింట్ డైరెక్టర్ జయప్రకాశ్ తెలిపారు. మంగళవారం స్థానిక ఆ శాఖ కార్యాలయంలోని తన చాంబర్‌లో జిల్లా వ్యాప్తంగా 59 మంది కో ఆర్డినేటర్లతో జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు, విద్యార్థుల తల్లుల ఆధార్ ఆయా బ్యాంకుల ఖాతాలతో లింకు కాలేదన్నారు. ఈ సమస్యను త్వరితగతిన పరిష్కరించాలన్నారు. జగనన్న వసతి దీవెన నిధులు ఈనెల 26వ తేదీన విడుదలయ్యే అవకాశం ఉందని తెలిపారు. ఇప్పటివరకు జిల్లాలో అర్హులైన ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ ఈబీసీ వర్గాలకు చెందిన విద్యార్థులు 51 వేల మంది ఉన్నారన్నారు. సాంకేతిక సమస్యలను పరిష్కరిస్తే విద్యార్థుల సంఖ్య మరో ఐదారు వేలకు పెరిగే అవకాశం ఉంటుందన్నారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న కో ఆర్డినేటర్లు, క్షేత్ర స్థాయిలో ఉన్న సాంకేతిక సమస్యలను పరిష్కరించి విద్యార్థులు లబ్ధి పొందేలా చర్యలు తీసుకోవాలన్నారు.

న్యూస్‌రీల్

ప్రభుత్వాసుపత్రిలో కరోనా కలకలం

బద్వేలు అర్బన్ : స్థానిక ప్రభుత్వాసుపత్రిలో మళ్లీ కరోనా కలకలం సృష్టించింది. ఇటీవల ప్రభుత్వాసుపత్రిలో కరోనా పరీక్షలు చేస్తున్న నేపథ్యంలో ఆసుపత్రిలోని ఓ వైద్యుడు, ఇద్దరు సిబ్బందికి జ్వరం వస్తుండటంతో పరీక్ష చేయించుకోగా కరోనాగా నిర్ధారణ అయింది. దీంతో ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రాంప్రసాద్ ఆసుపత్రిని శానిటైజ్ చేయించడంతో పాటు సిబ్బందిని అప్రమత్తం చేశారు. ఇకపై ఆసుపత్రి సిబ్బంది మాస్కులు ధరించడంతో పాటు ఆసుపత్రికి వచ్చే రోగులు కూడా మాస్కులు ధరించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

ప్రార్థనలతో అల్లాహ్‌కు దగ్గరయ్యేందుకే రంజాన్



ఇఫ్తార్ ప్రార్థనలు నిర్వహిస్తున్న డిప్యూటీ సీఎం అంజద్‌బాషా తదితరులు

కడప కల్చరల్ : ప్రత్యేక ప్రార్థనల ద్వారా ఏకేశ్వరుడైన అల్లాహ్‌కు దగ్గరయ్యేందుకే ఆయన రంజాన్ పేరిట మానవాళికి అద్భుతమైన అవకాశం కల్పించారని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ఎస్‌బీ అంజద్‌బాషా తెలిపారు. మంగళవారం రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని కడప నగరం 11వ డివిజన్ ఇన్‌చార్జి విజయ్‌భాస్కర్‌వర్మ ఆధ్వర్యంలో, మృత్యుంజయకుంటలోని నవబి మసీదులో దావతే ఇఫ్తార్ పేరిట ఇచ్చిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాలు ప్రజల మధ్య ఆత్మీయత, సామరస్యాలు, స్నేహభావాన్ని పెంచగలవన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మైనార్టీ నాయకులు అఫ్జల్‌ఖాన్, డాక్టర్ సొహైల్ అహ్మద్, సుభాన్‌బాషా రామచంద్రయ్య, కార్పొరేటర్ షఫీ, మత గురువులు, ముస్లిం ప్రముఖులు పాల్గొన్నారు.

రిమ్స్‌లో ఎన్‌ఎంసీ అధికారుల పర్యటన



కడప రిమ్స్ బయోకెమిస్ట్రీ విభాగంలో పరిశీలిస్తున్న ఎన్‌ఎంసీ అధికారులు

కడప అర్బన్: కడప నగర శివార్లలోని ప్రభుత్వ సర్వజన వైద్య కళాశాల (రిమ్స్)లో బయోకెమిస్ట్రీ విభాగానికి ఐదు పీజీ సీట్ల ప్రతిపాదనలకు సంబంధించి నేషనల్ మెడికల్ కౌన్సిల్ (ఎన్‌ఎంసీ) అధికారుల బృందం సభ్యులు మంగళవారం పర్యటించారు. ఆ విభాగంలో పరిశీలన చేశారు. ఎన్‌ఎంసీ సభ్యుడు కర్ణాటక రాష్ట్రం గుల్బర్గా ఈఎస్ఐసీ మెడికల్ కళాశాల బయోకెమిస్ట్రీ హెచ్‌ఓడీ డాక్టర్ సతీష్‌కుమార్, సిబ్బంది బృందంలో ఉన్నారు. ఈ కార్యక్రమంలో కడప రిమ్స్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ. సురేఖ, అధ్యాపక బృందం పాల్గొన్నారు.

బుక్ మై వేతో తిరుమల ప్యాకేజీ అనుసంధానం

బి.కొత్తకోట: పర్యాటకశాఖ ద్వారా అమలు చేస్తున్న శ్రీవారి దర్శన ప్యాకేజీని బుక్ మై వే సంస్థతో అనుసంధానం చేస్తున్నట్లు ఆ శాఖ తిరుపతి, కడప డివిజనల్ మేనేజర్ మదితాటి గిరిధర్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన బి.కొత్తకోట మండలంలోని పర్యాటక కేంద్రం హార్సిలీహిల్స్‌పై తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ శ్రీవారి దర్శన ప్యాకేజీల అమలు మరింత పారదర్శకంగా, భక్తులకు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. తిరుపతి డివిజన్‌లో 2022-23లో పర్యాటక ఆదాయం రూ.74.23 కోట్లు వచ్చిందన్నారు. పర్యాటక ప్రాంతాల నుంచి రు.16.98 కోట్లు రాగా, రవాణా విభాగం నుంచి రూ.57.24 కోట్లు వచ్చిందన్నారు. కడప డివిజన్‌లో 2022-23లో రూ.4.87 కోట్ల ఆదాయం లభించగా కడప బార్, రెస్టారెంట్, గదుల ద్వారా రూ.2.34 కోట్లు, గండి నుంచి రూ.24.37 లక్షలు, గండికోట నుంచి రూ.1.23 కోట్లు, ఇడుపులపాయ నుంచి రూ.30లక్షలు, ఒంటిమిట్ట నుంచి రూ.54.24 లక్షల ఆదాయం వచ్చిందన్నారు.

పరిహారం చెల్లింపుల్లో జోక్యం చేసుకోం

పిల్ కొట్టేసిన హైకోర్టు ధర్మాసనం

సాక్షి, అమరావతి : వైఎస్సార్ జిల్లా, మలినేనిపట్నం గ్రామస్తుల్లో కొందరికి భూ సేకరణ పరిహారం చెల్లించకుండా ఆదేశాలు ఇవ్వాలంటూ దాఖలైన ప్రజా ప్రయోజన వ్యాజ్యాన్ని హైకోర్టు కొట్టేసింది. ఓసారి పరిహారం ఖరారు చేస్తూ అవార్డ్ జారీ అయిన తరువాత దానిని చట్ట ప్రకారం చెల్లించాల్సిందేనని తేల్చి చెప్పింది. ఈ వ్యాజ్యంలో ఎలాంటి ప్రజా ప్రయోజనాలు లేవని స్పష్టం చేసింది. పేదలకు దక్కాల్సిన పరిహారం దక్కకుండా చేసేందుకే ఈ వ్యాజ్యం దాఖలు చేసినట్లు ఉందని హైకోర్టు ఘాటుగా వ్యాఖ్యానించింది. ఈ వ్యాజ్యంలో తదుపరి విచారణ అవసరం లేదంటూ పిటిషన్‌ను కొట్టేసింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి (సీజే) జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా, న్యాయమూర్తి జస్టిస్ నైనాల జయసూర్య ధర్మాసనం ఉత్తర్వులు జారీ చేసింది. సోమశిల ప్రాజెక్టు భూ సేకరణలో సేకరించిన ఆస్తులకు పరిహారం చెల్లింపుల్లో అక్రమాలు చోటు చేసుకుంటున్నాయని, బోగస్ నిర్మాణాలకు సైతం చెల్లింపులు చేస్తున్నారంటూ కడప, చిన్నచౌక్‌కు చెందిన సామాజిక కార్యకర్త మామిడి ఎల్లారెడ్డి హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం (పిల్) దాఖలు చేశారు. ఈ వ్యాజ్యంపై మంగళవారం సీజే ధర్మాసనం విచారణ జరిపింది. పిటిషనర్ తరఫు న్యాయవాది రామకోటేశ్వరరావు వాదనలు వినిపిస్తూ, నిర్మాణాలు లేకపోయినా కూడా ఉన్నట్లు చూపి పరిహారం పొందుతున్నారని తెలిపారు. అధికారుల జాయింట్ ఇన్‌స్పెక్షన్ రిపోర్ట్, డ్రాఫ్ట్ నోటిఫికేషన్‌లో లేని నిర్మాణాలకు సైతం పరిహారం చెల్లిస్తున్నారని వివరించారు. వాదనలు విన్న ధర్మాసనం, ఓసారి పరిహారం నిర్ణయిస్తూ అవార్డ్ జారీ అయిన తరువాత దానిని చెల్లించాల్సిందేనని స్పష్టం చేసింది. ఇందులో ఏ రకంగానూ జోక్యం చేసుకోలేమన్న ధర్మాసనం పిల్‌ను కొట్టేస్తున్నట్లు ఉత్తర్వులు జారీ చేసింది.

కారు, ట్రాక్టర్ ఢీ: వ్యక్తికి గాయాలు

రాయచోటిటౌన్ : పట్టణంలోని మదనపల్లె రోడ్డులో జరిగిన రోడ్డుప్రమాదంలో కారు డ్రైవర్ జనార్ధన్ రెడ్డికి గాయాలయ్యాయి. మంగళవారం రాత్రి రా మదనపల్లె వైపు నుంచి రాయచోటికి వస్తున్న కారును రాయచోటి పట్టణం నుంచి మదనపల్లె రోడ్డు వైపు వెళ్లుతున్న ట్రాక్టర్ ఢీకొట్టింది. ఈసంఘటనలో కారులో ఉన్న జనార్ధన్‌రెడ్డికి గాయాలయ్యాయి. గాయపడిన వ్యక్తిని రాయచోటి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ట్రాఫిక్ ఎస్ఐ మహమ్మద్ రఫీ తెలిపారు.

మది నిండా భక్తిభావం

- భక్తిశ్రద్ధలతో షబ్బే ఖద్ర్ ప్రార్థనలు
- ఆధ్యాత్మిక చింతనతో భక్తులు


విద్యుద్దీప వెలుగుల్లో కడప ఏడురోడ్ల వద్ద ఉన్న మసీదు

కడప కల్చరల్ : జిల్లా అంతటా పండుగకు ముందే రంజాన్ కళ కనిపిస్తోంది. ముస్లింలందరూ మరో మూడు రోజుల్లో పండుగ కోసం ఏర్పాట్లు చేసుకుంటున్నారు. అల్లాహ్‌పైన తమకు గల భక్తిభావాన్ని తెలుపు కోవడానికి ఆయన చూపిన మార్గంలో పయనించేందుకు ఈ మాసం ఉపయోగపడుతుంది గనుక నిండైన భక్తి భావంతో మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్నారు.

మంగళవారం షబ్బే ఖద్ర్ పర్వదినం కావడంతో మసీదులన్నీ ఆధ్యాత్మిక చింతనగల భక్తులతో కళకళలాడాయి. పవిత్ర ఖురాన్‌లోని దైవ సందేశం గురించి వివరిస్తున్న గురువుల బోధనలతో భక్తిభావనను నింపాయి. షబ్బే ఖద్ర్ (బడీరాత్) ప్రత్యేక ప్రార్థనలతో ఆయా ప్రాంతాలు కొత్త కళను సంతరించుకున్నాయి. రంజాన్ మాసంలో అతి ముఖ్యమైన చివరిఘట్టం షబ్బే ఖద్ర్‌తో ప్రారంభమైంది.

బడీరాత్ నిర్వహణ కోసం రెండు, మూడు రోజుల ముందు నుంచి నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేశారు. మసీదుల్లో రాత్రి తరావీ ప్రార్థనల అనంతరం ముఖ్యఘట్టం ప్రారంభమైంది. ఈరోజున ఆధ్యాత్మిక సందేశం ఇచ్చేందుకు ఆహ్వానించిన దేశంలోని ప్రముఖ గురువులు బోధనలను చేశారు. పవిత్ర ఖురాన్‌లోని పలు ముఖ్యమైన ఘట్టాలను వారు ఈ సందర్భంగా వివరించారు. మహా ప్రవక్త మహమ్మద్ (సా.అ.వ) జీవితంలోని ముఖ్యమైన అంశాలు, ఆయన బోధనలను గురించి కూడా తెలియజేశారు. భక్తుల సామూహిక ప్రార్థనలు (జికర్) నిర్వహించారు. రాత్రంతా మసీదు ప్రాంగణాల్లో భక్తులు పూర్తి ఆధ్యాత్మిక చింతనతో గడిపారు. దాదాపు తెల్లవారు జామున సెహరీ వరకు బోధనలు కొనసాగాయి. సామూహిక ప్రార్థనలు ముగిశాక పలువురు తమ పెద్దల సమాధుల వద్దకు వెళ్లి వారి తప్పులు క్షమించాలని, స్వర్గలోక ప్రాప్తి కలిగించాలని అర్థించారు. దాదాపు ప్రతి ఇంటిలో మహిళలు ప్రత్యేక ప్రార్థనలతో షబ్బేఖద్ర్‌ను భక్తి శ్రద్ధలతో నిర్వహించారు.

కారు బోల్తా



ఖాజీపేట : ఖాజీపేట మండలం సిద్ధాంతిపురం సమీపంలోని జాతీయ రహదారి పై కారు బోల్తా పడింది. ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. పోలీసుల కథనం మేరకు నంద్యాలకు చెందిన మునిక్ భవన్ కుటుంబ సభ్యులు నలుగురు తిరుమల వెంటేశ్వర స్వామి దర్శనానికి వెళ్లారు. దర్శనానంతరం మంగళవారం నంద్యాలకు బయలుదేరారు. వైఎస్సార్ జిల్లా సిద్ధాంతిపురం సమీపంలో డివైడర్‌ను ఢీ కొని కారు బోల్తాపడింది. ఈ ప్రమాదంలో మహాలక్ష్మి (50) మనిక్ భవన్ (52)లకు తీవ్రగాయాలయ్యాయి. మిగిలిన ఇద్దరికి ఎలాంటి గాయాలు కాలేదు. క్షతగాత్రులను 108 వాహనంలో కడప రిమ్స్‌కు తరలించారు.

లారీ,బైక్ ఢీ: విద్యార్థి మృతి


గోకుల్ (ఫైల్)

బద్వేలు అర్బన్ : స్థానిక నెల్లూరు రోడ్డులోని శేఖర్ థియేటర్ సమీపంలో మంగళవారం లారీ ఢీకొన్న ఘటనలో ఓ విద్యార్థి మృతిచెందాడు. వివరాలు..పట్టణంలోని అగ్రహారానికి చెందిన నాగేంద్ర, హరితలకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. వీరిలో పెద్దవాడైన పాలెంగోకుల్ (16) స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఇటీవలే పదవ తరగతి పూర్తి చేశాడు. డిప్లొమా చేయాలన్న ఉద్దేశంతో స్థానిక నెల్లూరు రోడ్డులోని ఓ కోచింగ్ సెంటర్‌లో కోచింగ్‌కు చేరాడు. కోచింగ్ ముగిసిన తర్వాత మధ్యాహ్నం సమయంలో తన బావ అయిన శబరికుమార్ ద్విచక్ర వాహనంలో ఇంటికి వస్తుండగా వెనుకవైపు నుంచి ఫ్లైయాష్ లారీ వేగంగా ఢీకొనడంతో గోకుల్ తీవ్రంగా, శబరికుమార్‌కు స్వల్పంగా గాయపడ్డారు. స్థానికులు ఇద్దరిని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గోకుల్ మృతిచెందాడు. మూడేళ్ల క్రితం గోకుల్ తండ్రి నాగేంద్ర కూడా రోడ్డు ప్రమాదంలోనే మృతిచెందాడు. తండ్రి లేకపోయినప్పటికీ తల్లి కష్టం మీద చదువుకుంటూ మరోవైపు ఓ దుకాణంలో పనిచేస్తూ కుటుంబానికి ఆసరాగా ఉండేవాడు. చేతికి అందివచ్చే వయస్సులో కుమారుడు మృతిచెందడంతో ఆ తల్లి బోరున విలపించింది. తన ఆశల దీపం ఆరిపోయిందంటూ గుండెలవిసేలా రోదించింది. మృతుని బావ శబరికుమార్ ఇచ్చిన మేరకు అర్బన్ ఎస్ఐ కత్తివెంకటరమణ కేసు నమోదు చేశారు. ప్రమాదానికి కారణమైన లారీని స్టేషన్‌కు తరలించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు.

మామ హత్య కేసులో ఇద్దరికి జీవితఖైదు


నిందితులతో పోలీసులు

ఎర్రగుంట్ల : 2019లో జరిగిన హత్యకేసులో ఇద్దరు వ్యక్తులను దోషులుగా నిర్ధారించి జీవితఖైదు విధిస్తూ ప్రొద్దుటూరు సెకండ్ అడిషనల్ డిస్ట్రిక్ కోర్టు జడ్జి జీఎస్ రమేష్‌కుమార్ మంగళవారం తీర్పు ఇచ్చారు. రాయపాటి కిరణ్‌కుమార్‌రెడ్డి, మల్లెము శ్రీనివాసరెడ్డిలకు జీవిత ఖైదుతో పాటు రూ.11 లక్షల జరిమానా, ఇది కట్టని పక్షంలో మరో 8 ఏళ్ల జైలుశిక్ష అనుభవించాలని పేర్కొన్నారు. ఎర్రగుంట్ల సీఐ మంజునాథ్‌రెడ్డి విలేకరులకు వివరాలు వెల్లడించారు. వైఎస్సార్‌జిల్లా సింహాద్రిపురం మండలం బలపనూరు గ్రామానికి చెందిన రాయపాటి కిరణ్‌కుమార్‌రెడ్డి ఏపీఎస్‌పీడీసీఎల్‌లో లైన్‌మెన్‌గా పని చేస్తున్నాడు. ప్రొద్దుటూరులోని నెహ్రూ రోడ్డుకు చెందిన యరమల చెన్నకృష్ణారెడ్డి కుమార్తెను వివాహం చేసుకున్నాడు. రాయపాటి కిరణ్‌కుమార్‌రెడ్డి మామ పేరిట కోటి రూపాయలు ఇన్సూరెన్స్ చేయించారు. తర్వాత డబ్బు మీద ఆశతో మామాను హత్య చేసి పోట్లదుర్తి గ్రామ సమీపంలో కారు ప్రమాదంగా చిత్రీకరించిన సంఘటన 2019లో జరిగింది. ఈ కేసును అప్పటి ఎర్రగుంట్ల సీఐ టీవీ రమణ విచారణ చేసి నిందితులైన రాయపాటి కిరణ్‌కుమార్‌రెడ్డి, మల్లెము శ్రీనివాసరెడ్డిలను అరెస్టు చేసి రిమాండుకు పంపించారు. తర్వాత సీఐగా వచ్చిన సీఐ సదాశివయ్య చార్జ్ షీట్ వేశారు. ఈ కేసులో సాక్షులను ప్రవేశ పెట్టి నిందితులకు శిక్ష పడేలా కృషి చేసినట్లు సీఐ మంజునాథ్‌రెడ్డి తెలిపారు. ఈ కేసును ప్రభుత్వ లాయర్ పీపీ టీ రాం ప్రసాద్‌డ్డి వాదించారు. నిందితుల తరుపున లాయర్ ఈశ్వర్‌రెడ్డి వాదించారు. ఎస్ఐ వెంకటక్రిష్ణయ్య, ప్రవీణ్‌కుమార్ కేసు దర్యాప్తు చేపట్టారని, సాక్షులను ప్రవేశపెట్టడంలో పోలీసులు కీలక పాత్ర వహించారన్నారు.

నిబంధనలు పాటించకుంటే చర్యలు


మాట్లాడుతున్న డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ శాంతికళ

ప్రొద్దుటూరు క్రైం : ప్రభుత్వ నిబంధనలు పాటించని స్కానింగ్ సెంటర్లపై చర్యలు తీసుకుంటామని డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ శాంతికళ తెలిపారు. జిల్లా ఆస్పత్రిలో మంగళవారం లింగనిర్ధారణ చట్టంపై సబ్ డిస్ట్రిక్ లెవెల్ అడ్వైజరీ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కమిటీ చైర్మన్, డిప్యూటీ డీఎంహెచ్ఓ మాట్లాడుతూ స్కానింగ్ సెంటర్ల నిర్వాహకులు పీసీ పీఎన్‌డీటీ చట్టాన్ని అమలు చేయాలన్నారు. లింగనిర్ధారణ పరీక్షలు చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నిబంధనలు ఉల్లంఘిస్తే డాక్టర్ గుర్తింపును పాక్షికంగా రద్దు చేసే అవకాశం ఉందని తెలిపారు. అంతేగాక మూడేళ్ల జైలు శిక్షతో పాటు రూ. 10 వేలు జరిమానా విధిస్తారన్నారు. రెండో సారి తప్పు చేస్తే ఐదేళ్ల జైలు శిక్ష, రూ. 50 వేలు జరిమానా, డాక్టర్ గుర్తింపును శాశ్వతంగా రద్దు చేస్తారని చెప్పారు. అర్హత లేని వ్యక్తులతో స్కానింగ్ పరీక్షలు చేయరాదన్నారు. అనుమతి పొందిన దాని కంటే ఎక్కువ మిషన్లు ఉన్నా, రికార్డుల్లో పొరపాట్లు ఉన్నా ముందస్తు నోటీసు లేకుండానే స్కానింగ్ సెంటర్లను సస్పెన్షన్ చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో మెడికల్ సూపరింటెండెంట్ ఆనంద్‌బాబు, గైనకాలజిస్టు శ్రీవాణి, రేడియాలజిస్టు నాగరాజు, హెల్త్ ఎడ్యుకేటర్ వెంకటేశ్వర్లు, కమిటి సభ్యులు శ్రీదేవి, దేవదాసు, స్కానింగ్ సెంటర్ నిర్వాహకులు పాల్గొన్నారు.

మహిళ మెడలో గొలుసు అపహరణ

చింతకొమ్మదిన్నె : నగర శివార్లలోని ప్రొఫెసర్ కాలనీలో చైన్ స్నాచింగ్ జరిగినట్లు చింతకొమ్మదిన్నె ఎస్ఐ బి. అరుణ్ రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం ఆయన తెలిపిన సమాచారం మేరకు వల్లూరు మండలం అదినిమ్మాయపల్లెకు చెందిన గండ్లూరి ఉమా మహేశ్వరి ప్రొఫెసర్ కాలనీలో ఉంటోంది.. సోమవారం కూరగాయలను కొనుగోలు చేసి ఇంటికి వెళుతుండగా గుర్తు తెలియని వ్యక్తి వెనకాలే వస్తూ ఆమె మెడలోని చైన్ లాక్కొని పారిపోయినట్లు తెలిపారు. ఈ వ్యక్తి అదే రోజు కడప వనటౌన్ పరిధిలో చైన్ స్నాచింగ్‌లకు పాల్పడినట్లు సీసీ ఫుటేజీ ద్వారా గుర్తించామన్నారు. చైన్ స్నాచింగ్ పాల్పడిన వ్యక్తి వివరాలు తెలియరాలేదన్నారు. ఇతని వయస్సు దాదాపు 20 నుంచి 25 సంవత్సరాల మధ్యలో ఉంటుందన్నారు. గండ్లూరి ఉమా మహేశ్వరి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. సమాచారం తెలిసిన 91211 00526 నంబర్‌కు సమాచారం అందించాలన్నారు.

పుష్పగిరి బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ


శ్రీ లక్ష్మీ చెన్న కేశవ స్వామి ఆలయంలో మేదినీ పూజను నిర్వహిస్తున్న అర్చకులు

వల్లూరు: ప్రముఖ పుణ్య క్షేత్రమైన పుష్పగిరిలో శ్రీ కామాక్షీ వైద్యనాథేశ్వర స్వామి, శ్రీ లక్ష్మీ చెన్న కేశవ స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలకు మంగళవారం రాత్రి అంకురార్పణ చేశారు. తొలుత శ్రీ కామాక్షీ, వైద్యనాథస్వామి ఆలయంలో ఆలయ పూజారి శ్రీనివాసమూర్తి ఆధ్వర్యంలో గణపతి పూజతో కార్యక్రమాలను ప్రారంభించారు. స్వామివారికి ప్రత్యేక పూజలను నిర్వహించారు. అనంతరం పుణ్యాహవాచనము, అఖండ దీపారాధన, రక్షా బంధనము కార్యక్రమాలను చేపట్టారు. మృత్సంగ్రహణ అనంతరం ఆలయంలో బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ చేశారు. కొండ పైన గల శ్రీ లక్ష్మీ చెన్నకేశవ స్వామి ఆలయంలో ఆలయ ప్రధాన అర్చకులు అఖిల్ దీక్షితులు ఆధ్వర్యంలో ఉదయం స్వామి వారికి అభిషేకం చేశారు. స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించారు. రాత్రి విశ్వక్సేన పూజతో కార్యక్రమాలను ప్రారంభించారు. పుట్ట వద్దకు వెళ్లి పవిత్రమైన మట్టిని తీసుకుని వచ్చి భూదేవిగా అలంకరించి మేదినీ పూజను నిర్వహించారు. అనంతరం యాగశాలలో పాళికల్లో ఉంచి సోమ కుంభాన్ని ఆవాహన చేసి నవధాన్యాలతో అంకురార్పణ కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. అభినవ చెన్న కేశవ స్వామి ఆలయంలో ఉన్న శ్రీ కామాక్షీ వైద్యనాథ స్వామి, శ్రీ దేవి , భూదేవి సమేత చెన్న కేశవ స్వామి ఉత్సవ మూర్తులను ఆయా ఆలయాలకు తీసుకుని వెళ్లి పూజలు జరిపారు. కార్యక్రమంలో పూజారులు సుమంత్ దీక్షితులు, రాజేష్ పాల్గొన్నారు.

పుష్పగిరి బ్రహ్మోత్సవాల్లో నేడు

బ్రహ్మోత్సవాల్లో భాగంగా పుష్పగిరిలో బుధవారం శ్రీ కామాక్షీ వైద్యనాథేశ్వర స్వామి ఆలయంలో ఉదయం స్వామి వారికి రుద్రాభిషేకం , అమ్మవారికి కుంకుమార్చన జరుగుతాయి. అనంతరం అగ్ని ప్రతిష్ఠాపన, నవ కలశ స్థాపన జరుగుతాయి. రాత్రి ధ్వజారోహణంతో బ్రహ్మోత్సవాలు ప్రారంభమవుతాయి. రాత్రి స్వామి వారికి తిరుచ్చి వాహన సేవ జరుగుతుంది.

■ శ్రీ లక్ష్మీ చెన్న కేశవ స్వామి ఆలయంలో రాత్రి విశ్వక్సేన పూజ, అగ్ని ప్రతిష్ఠాపన, నవ కలశ స్థాపన, ధ్వజా రోహణం, భేరీ పూజలు జరుగుతాయి. స్వామివారికి తిరుచ్చి వాహన సేవ ఉంటుంది.

23 న పుష్పగిరిలో రాష్ట్ర స్థాయి బండలాగుడు పోటీలు

పుష్పగిరి శ్రీ కామాక్షీ వైద్యనాథేశ్వర స్వామి, శ్రీ లక్ష్మీ చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా ఈ నెల 23 వ తేదీన సాయంత్రం 5 గంటల నుంచి అఖిల భారత ఒంగోలు జాతి ఎద్దుల బల ప్రదర్శనలో ఓల్డ్ కేటగిరీ వృషభ రాజములచే రాష్ట్రస్థాయి బండలాగుడు పోటీలు నిర్వహించనున్నారు. ఈ పోటీలు భారతి సిమెంట్ పరిశ్రమ వారి సౌజన్యంతో ఫ్లడ్ లైట్ల వెలుగులో జరుగుతాయని నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. విజేతలకు మొదటి బహుమతి రూ 60 ,116 లను యం.నరేందర్ రెడ్డి, యం. మహేంద్రారెడ్డి (ఎంఆర్ హోండా ప్రొద్దుటూరు), రెండవ బహుమతి రూ.50,116 లను తోట ప్రభాకర్ (ఇగ్రో వర్చువల్ ఐటీ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్, హైదరాబాద్), మూడో బహుమతి రూ.40,116 లను బలుసా చంద్ర (శ్రీనివాస ప్లైవుడ్, కడప), నాలుగో బహుమతి రూ.30,116, ఐదో బహుమతి రూ.20,116 లను భారతి సిమెంట్ ప్రైవేట్ లిమిటెడ్, నల్లింగాయపల్లె, ఆరో బహుమతి రూ.12,116 గోటూరుకు చెందిన పొన్నోలు శివకుమార్ రెడ్డి, ఏడో బహుమతి రూ. 8,116 లను సంతకొవ్వూరుకు చెందిన బండి లక్ష్మిరెడ్డి విరాళంగా అందజేస్తున్నారని తెలిపారు. పోటీలో పాల్గొన్న ప్రతి కాడి ఎద్దులకు ఒక్కో కాడికి రూ.4 వేల చొప్పున కన్సొలేషన్ బహుమతులను భారతి సిమెంట్ ప్రైవేట్ లిమిటెడ్ వారు ఇవ్వనున్నారని పేర్కొన్నారు.

21 నుంచి కడప గడపలో టీ–20 మ్యాచ్‌లు



కడప స్పోర్ట్స్ : కడప నగరంలోని వైఎస్ రాజారెడ్డి–ఏసీఏ క్రికెట్ మైదానం వేదికగా ఈనెల 21 నుంచి 26వ తేదీ వరకు సౌత్‌జోన్ ఏసీఏ సీనియర్ మెన్ టీ–20 అంతర్ జిల్లాల క్రికెట్ మ్యాచ్‌లు నిర్వహిస్తున్నట్లు జిల్లా క్రికెట్ సంఘం కార్యదర్శి అవ్వారు రెడ్డి ప్రసాద్ తెలిపారు. కడప, అనంతపురం , నెల్లూరు, కర్నూలు, చిత్తూరు జిల్లాలకు చెందిన జట్లు ఈ పోటీల్లో తలపడనున్నట్లు తెలిపారు. అనంతరం సౌత్‌జోన్ పోటీల్లో పాల్గొనే జిల్లా జట్లను ఆయన ప్రకటించారు.

మ్యాచ్‌ల వివరాలు..

తేదీ	సమయం	జట్లు
21-04-23	ఉదయం	అనంతపురం x నెల్లూరు
	మధ్యాహ్నం	కడప x కర్నూలు
22-04-23	ఉదయం	చిత్తూరు x నెల్లూరు
	మధ్యాహ్నం	అనంతపురం x కర్నూలు
23-04-23	ఉదయం	కడప x చిత్తూరు
	మధ్యాహ్నం	కర్నూలు x నెల్లూరు
25-04-23	ఉదయం	అనంతపురం x చిత్తూరు
	మధ్యాహ్నం	కడప x నెల్లూరు
26-04-23	ఉదయం	చిత్తూరు x కర్నూలు
	మధ్యాహ్నం	అనంతపురం x కడప

కడప జట్టు : ఎస్ఎండీ రఫీ (కెప్టెన్), టి. వంశీకృష్ణ (వైస్ కెప్టెన్), జి. జయవర్ధన్, డి. నరేన్‌రెడ్డి, ఎస్. ధృవకుమార్‌రెడ్డి, ఎస్. జహీర్‌అబ్బాస్, పి. జాఫర్‌అలీఖాన్, జి.వి.పవన్‌కుమార్‌రెడ్డి, ఎం.హరిశంకర్‌రెడ్డి, కె.యశ్వంత్, ఎస్. ఆరీఫ్‌బాషా, ఎస్. ఆసిఫ్‌హుస్సేన్, ఎం .మదన్‌కుమార్, ఎ. యువరాజ్, కె.సుదర్శన్, కె.మారుతీశంకరాచారి. స్టాండ్‌బై : ఎం. శ్రీనివాసులరెడ్డి, ఎం.చెన్నారెడ్డి, ఎం. విజయభవేంద్ర, జి.ఆంజనేయులు, ఎస్. ఆదిల్‌హుస్సేన్, పి.వెంకటేష్‌కీర్తన్, వి.ధనుష్‌రెడ్డి, కె.వెంకటసతీష్, ఎస్.అస్లాం.

బీటెక్ విద్యార్థి ఆత్మహత్య


మధు (ఫైల్)

కురబలకోట: కురబలకోట మండలం అంగళ్లులోని ఓ కళాశాలలో సీఎస్ఈ బీటెక్ తృతీయ సంవత్సరం చదువుతున్న మధు (21) ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ముదివేడు పోలీసుల కథనం మేరకు.. పీటీఎం మండలం అంగడివారిపల్లెకు చెందిన కుడుం ఉత్తన్న కుమారుడు మధు చదువుల్లో మేటి. పదిలో ఫస్ట్‌క్లాస్‌లో పాసయ్యాడు. ఇంటర్‌లో కూడా రాణించాడు. అంగళ్లులోని ఓ కళాశాలలో ఇతనికి సీఎస్ఈలో ఫ్రీ సీటు వచ్చింది. తృతీయ సంవత్సరం చదువుతున్నాడు. సహ విద్యార్థులతో బాగా కలసిపోయే వాడు. అంగళ్లులో రూము అద్దెకు తీసుకుని కళాశాలకు రాకపోకలు సాగించేవాడు. ఈనేపథ్యంలో ఈనెల 12న సాయంత్రం నుంచి కన్పించకుండా పోయాడు. రూముకు రాకపోవడంతో స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారు కూడా చుట్టుపక్కల విచారించారు. సెల్ ఫోన్ కూడా రూములో వదిలి వెళ్లాడు. ఇతని ఆచూకీ కోసం కుటుంబీకులు పలుచోట్ల గాలించారు. ఎక్కడైనా ఉంటాడులే అని భావి స్తూ వచ్చారు. మంగళవారం ఉదయం అంగళ్లులోని తుమ్మచెట్లపల్లె వద్ద ఉన్న కోల్డ్ స్టోరేజ్ వెనుక వైపు ప్రాంతంలో దుర్వాసన రాసాగింది. స్థానికులు పరిశీలించి చూడగా కుళ్లిన స్థితిలో శవం కన్పించింది. మృతుడి దుస్తులు, చెప్పుల ఆధారంగా అదృశ్యమైన మధుగా గుర్తించారు. పక్కన టమాటా పంట వద్ద ఉన్న డ్రిప్ వైరుతో ఇతను చెట్టుకు ఉరి వేసుకున్నట్లు సంఘటన స్థలాన్ని బట్టి స్పష్టమవుతోంది. ముట్టుకుంటే ఊడిపోయే పరిస్థితి కావడంతో డాక్టర్లు మంగళవారం సంఘటన స్థలానికి వచ్చి పోస్టుమార్టం నిర్వహించారు. మృత దేహాన్ని కుటుంబీకులకు అప్పగించారు.

ఎందుకురా ఇలా చేశావ్..

ఇదిలా ఉండగా మధుకు తెలివైన విద్యార్థిగా పేరుంది. ఎవ్వరితో ఎలాంటి విబేధాలు లేవు. ఆర్థిక సమస్యతో స్నేహితులను ఇటీవల డబ్బు అడిగినట్లు చెబుతున్నారు.

దీనికి తోడు అంగళ్లుకు చెందిన మరొకరికి బాకీ ఉన్నట్లు సమాచారం. కొత్త అప్పు పుట్టక మరో వైపు చేసిన అప్పు తీరే మార్గం కన్పించక మనో వేదనకు గురై ఆత్మహత్యకు పాల్పడి ఉండవచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. స్నేహితులు మాత్రం ఎందుకురా ఇంత పని చేశావని సంఘటన స్థలంలో కంట తడిపెట్టడం చూపరులను కలిచివేసింది. తమ్ముడూ.. ఏం తక్కువ చేశామురా నీకు.. మన కుటుంబంలో ఒక్కరూ చదువుకున్న వారు లేరు.. నువ్వన్నా ప్రయోజకుడవు అవుతావని ఎన్నో ఆశలు పెట్టుకున్నాం. మాకున్నా లేకున్నా.. కష్టపడి చదివిస్తున్నాం కదరా.. ఎందుకిలా చేశావురా.. అంటూ మధు అన్నయ్య బోరున విలపించాడు. ఈ సంఘటనపై సమగ్ర విచారణ జరుపుతున్నట్లు రూరల్ సర్కిల్ సీఐ శివాంజనేయులు తెలిపారు. ఐపీఎల్ ఆన్‌లైన్ బెట్టింగ్‌లు లేదా రుణ యాప్‌లు ఏమైనా ఈ సంఘటనకు దారి తీశాయా అన్న కోణంలో కూడా విచారణ జరుపుతున్నట్లు తెలిపారు.